క్లుప్తంగా

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ



ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇస్తున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి సిటీ: అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదానికి గురైన వారిని కాపాడే విధానంపై ఎన్‌సీసీ గర్ల్స్ కేడెట్లకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ నగర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు క్యాడెట్లు స్పందించాల్సిన తీరుపై స్విమ్స్ డాక్టర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ అంజూ వాద్వా, సుబేదార్ మేజర్ శర్మ, చీఫ్ ఆఫీసర్ భారతి, దేవకమ్మ, జవాన్లు పాల్గొన్నారు.

ఆ ముగ్గురిలో వీసీ పీఠం ఎవరిదో ?

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పీఠం ఆ ముగ్గురిలో ఎవరికి దక్కనుందో రేపోమాపో తేలిపోనుంది. ఇప్పటికే పలు వర్సిటీలకు పూర్తిస్థాయి వీసీలను నియమించిన ప్రభుత్వం జిల్లాలోని ద్రవిడ, ఎస్వీయూ వీసీల నియామకంలో ఏడాదిగా తర్జన భర్జన పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో వారం రోజు క్రితం ఎస్వీయూ ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి సెర్చ్ కమిటీ ప్రభుత్వానికి ప్రముఖంగా ముగ్గురి పేర్లను సూచించింది. ఇందులో హైదరాబాదుకు చెందిన ఏఆర్‌సీఐ డైరెక్టర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావు, ప్రస్తుత ఎస్వీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, వైజాగ్ విజ్ఞాన్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దయానంద్ పేర్లు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఫైల్ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు చేరిందని, మహానాడు అనంతరం వీసీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

20న జిల్లా మహాసభ

తిరుపతి కల్చరల్: స్క్రాప్‌ను పోగు చేసి దాన్ని మళ్లీ రీసైకిల్ చేయడం సమాజానికి తిరిగి ఉపయోపడేలా చేస్తున్న గుజిరీ వ్యాపారుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. జూన్ 20న తిరుపతిలో జరుగనున్న గుజిరీ వ్యాపారుల సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను సంఘ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజా, రవి, గుజిరీ వ్యాపారుల సంఘం నగర అధ్యక్షుడు దాము, సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

తిరుపతి మంగళం : తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, వివి ధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వకర్త భూమన అభినయ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

37 వినతులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 37 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా పది మంది తమ సమస్యలు తెలుపగా, 27 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఆయా సమస్యలను విభాగాల వారిగా అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు.

వైద్య విభాగంలో బదిలీలు

తిరుపతి తుడా: కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సి.యామినిని తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీకి, కడపలోని వేంపల్లె పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మీప్రియను తిరుపతి రూరల్ మండలం గొల్లపల్లె పీహెచ్‌సీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చిత్తూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఏఓ వై.పద్మజను ఎస్వీ వైద్య కళాశాల ఏఓగా బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది.

సారు.. ఎక్కడ మీ చాంబరు?

తిరుపతి జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి ప్రజలు ఆపసోపాలు పడి వస్తుంటారు. అయితే కలెక్టరేట్ లోపలకు వచ్చాక ఇంకో సమస్య మొదలవుతుంది. తాము కలవాలనుకున్న అధికారి చాంబర్ ఎక్కడ ఉందో తెలియక తికమక పడుతుంటారు. అక్కడ కనిపించే వారిని.. పలానా అధికారి చాంబర్ ఎక్కడ అంటూ అమాయకంగా అడుగుతుంటారు. అయితే కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు .. లోపలకు వచ్చేటప్పుడు కనిపించడం లేదు. బయటకు వెళ్లేటప్పుడు మాత్రమే కనిపిస్తోంది. అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- కలెక్టరేట్‌కు వచ్చే అయోమయానికి గురవుతున్న ప్రజానీకం
- ఏ చాంబర్ ఎక్కడో తెలుసుకోవడానికి నానాతంటాలు
- కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద శాఖల వారీగా తెలిపే బోర్డు ఏర్పాటు
- అయితే కార్యాలయంలోకి వచ్చేటప్పుడు కనిపించని బోర్డు..
- తిరిగి వెళ్లేటప్పుడు మాత్రమే కనిపిస్తున్న వైనం

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో ఏ బ్లాక్, బీ బ్లాక్ పేరుతో ఏడు అంతస్తుల్లో 32 శాఖలకు చెందిన విభాగాలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్, ఒకటో అంతస్తులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తుంటారు. రెండో అంతస్తులో కలెక్టర్, జేసీ, డీఆర్వో చాంబర్లతో పాటు పరిపాలన విభాగాలు ఉన్నాయి.

3 నుంచి 7 అంతస్తు వరకు చూస్తే..!

ఏ బ్లాక్‌లో 3వ అంతస్తు నుంచి 7వ అంతస్తు వరకు 15 విభాగాలు ఉన్నాయి. బీ బ్లాక్‌లో 3 నుంచి 7వ అంతస్తు వరకు 17 విభాగాలు ఉన్నాయి. మొత్తంగా 32 శాఖలకు చెందిన విభాగాలు ఉంటే.. అర్జీదారులు ఏ బ్లాక్‌లో, ఏ అంతస్తులో తమకు కావాల్సిన కార్యాలయం ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. దీంతో పలానా చాంబర్ ఎక్కడా అంటూ అక్కడ కనిపిస్తున్న వారందరినీ అడుగుతుంటారు. అయితే కొందరికి సమాచారం తెలియకపోవడంతో చెప్పడం లేదు. మరికొందరికి సమాచారం తెలిసినా స్పందించడం లేదు. దీంతో తమ సమస్యలను విన్నవించడానికి వారు సదరు అధికారిని కలవడానికి అర్జీదారులు నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులకు పలువురు ప్రజలు కలెక్టరేట్‌లో ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నామని.. కనీసం ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ఫిర్యాదు చేశారు. దీంతో బ్లాక్‌ల వారీగా, శాఖల వివరాలను తెలియజేస్తూ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద అధికారులు ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డు అర్జీదారులు కలెక్టరేట్‌లోనికి వెళ్లే సమయంలో కనిపించడం లేదు. తిరిగి బయటకు వెళ్లే సమయంలో మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేశారు. ఇలా చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని.. కార్యాలయంలోకి ప్రవేశించేటప్పుడే కనిపించేలా ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కలెక్టరేట్ నుంచి బయటకు వెళ్లే సమయంలో మాత్రమే కనిపిస్తున్న బోర్డు

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ మరుపొంగళ్లలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలో దర్శనం
- పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తిరుపతి నియోజకవర్గం పార్టీ శ్రేణులతో తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సమావేశం
- మంగళంలోని ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమం
- ఎయిర్ బైపాస్ రోడ్డులోని కృప టవర్స్ రెండవ అంతస్తు సమావేశ మందిరంలో ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈపీఎస్‌ఓ సమస్యల పరిష్కారం లక్ష్యంగా నిధి ఆప్కే నికట్ కార్యక్రమం
- తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీబలరామకృష్ణ స్వామి ఆలయంలో రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణస్వామి తిరుచ్చి ఉత్సవం
- సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు 'తరమెళ్లిపోతున్నదో' సాంఘిక నాటిక ప్రదర్శన
- సీపీఎల్ క్రికెట్ సీజన్1 ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో క్రికెట్ పోటీలు

లోవోల్టేజీ సమస్య పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఏఈ మోహన్

తిరుపతి మంగళం : ఉమ్మడి శెట్టిపల్లె పంచాయితీ పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ చర్యలు చేపడుతోంది. సోమవారం మంగళం-శెట్టిపల్లి మార్గంలో విద్యుత్ లైన్ల మార్పిడి, భగత్‌సింగ్ నగర్‌లో త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం పనులను విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ నియంత్రికల ఏర్పాటు లైన్ల మార్పిడి పనులను సంబంధిత మంగళం సబ్‌స్టేషన్ ఏఈ మోహన్ పర్యవేక్షించారు. సుమారు రూ.7 లక్షల వ్యయంతో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం భగత్‌సింగ్ నగర్, దాని పరిధిలోని కాలనీల్లో సింగిల్‌ఫేజ్ విద్యుత్ సదుపాయానికి బదులుగా త్రీఫేజ్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. అలానే మంగళం నుంచి శెట్టిపల్లె వరకు నూతనంగా నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డులో రహదారి నిర్మాణానికి అనువుగా విద్యుత్ లైన్లను సమర్థంగా తొలగించి, కొత్తలైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. లైన్ల తొలగింపు కార్యక్రమంలో భాగంగా ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకుంటున్నామని తెలిపారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం



పంచాయతీ పార్టీ అధ్యక్షులతో సమావేశమైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతనంగా నియమితులైన పంచాయతీ పార్టీ అధ్యక్షులు పనిచేయాలని చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పంచాయతీలకు పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారితో సోమవారం సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆదేశించే పార్టీ కార్యక్రమాలు ప్రతి పంచాయతీలో జరిగేలా చూడాలని, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలకు గ్రామ పంచాయతీల అధ్యక్షులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పార్టీలో నూతనంగా నియమితులైన పంచాయతీ పార్టీ అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మండల నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర రెడ్డి, సి.మునికృష్ణ, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, దామినేటి కేశవులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

పాకాల : రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర అభియాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యోగాపై శిక్షణ ఇవ్వాలని ఎంపీడీఓ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మండల సిబ్బంది మొత్తం 171 మందికి ఉచితంగా యోగాపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రామస్థాయి యోగా పోటీలు

చంద్రగిరి: గ్రామస్థాయి ప్రజలకు యోగాను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను యోగా పోటీలను మంగళవారం నుంచి మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిరుపతి తుడా: యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా నగరపాలక సంస్థ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగా పోటీలు నిర్వహించబడతాయని కమిషనర్ మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు మే 26 నుంచి జూన్ 18వ తేదీవరకు జరుగుతాయని, సచివాలయ, నగరపాలక, జిల్లా స్థాయిల్లో కమిటీలను నియమించి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఘాట్ రోడ్డులో చిరుత సంచారం

తిరుమల : తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో చిరుత సంచారం సోమవారం రాత్రి కలకలం సృష్టించింది. మొదటి ఘాట్ రోడ్డులోని వినాయకస్వామి ఆలయం సమీపంలో ఓ చిరుత ఘాట్ రోడ్డు పక్కన ఉన్న రక్షణగోడపై నుంచి పరుగెత్తుతూ వెళ్లింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న వాహదారుడు చిరుతను తన కెమెరాలో బంధించాడు. ఈ విషయమై టీటీడీ అటవీశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించాలి

తిరుపతి కల్చరల్: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా మరింతమందిని హత్య చేసిన మోదీ ప్రభుత్వం తక్షణమే ఆ మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు రోజులుగా కేశవరావు తమ్ముడు రాంప్రసాద్, మరో మావోయిస్టు నేత నాగేశ్వరరావు బంధువులు, నంద్యాల జిల్లాకు చెందిన సంగీత బంధువులు మృతదేహాల కోసం పడిగాపులు కాస్తున్నా స్పందించకపోవడం ఏంటన్నారు. సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, ఉదయ్‌కుమార్, అల్లాబక్షు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

తిరుపతి రూరల్ (రామచంద్రపురం) : విద్యార్థులు విద్యతో పాటు దేశ రక్షణ కోసం ఎన్‌సీసీలో చేరి ఐకమత్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ రాజ గోపాల్ జగదీష్ ఆత్రే సూచించారు. సోమవారం సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో వార్షిక శిక్షణ శిబిరాలను 11వ ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ, తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయం వారిచే ప్రారంభమయ్యాయి. జూన్ 3వ తేదీ వరకు జరిగే ఈ శిబిరంలో తిరుపతి, మదనపల్లె, బద్వేల్, చిత్తూరు జిల్లాలకు చెందిన 20 విద్యాసంస్థల నుంచి 509 మంది ఎన్‌సీసీ కేడెట్లు హాజరవుతున్నారని క్యాంపు పరిశీలకులు గుణశేఖర్ తెలిపారు. సీనియర్ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రధాన సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 13 మంది ఏఎన్‌ఓలు, భారత వైమానిక దళం, సైన్యంలోని 16 మంది సిబ్బంది, ఏపీకి చెందిన సివిల్ పోలీసు సహకారం అందిస్తున్నారు. శిక్షణ అధికారి లక్ష్మి నరసింహ, ఉపేందర్ రెడ్డి, ప్రియ, హేమలత, శిరీష పాల్గొన్నారు.

రసవత్తరంగా సీపీఎల్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న గిరీష్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్-1) క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.

36 పరుగుల తేడాతో పాయ్ వైస్రాయ్ గెలుపు

సోమవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాయ్ వైస్రాయ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అనంతరం 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలర్ గిరీష్‌రెడ్డి 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును డాక్టర్ జయప్రసాద్, ఈసీ సభ్యుడు శివప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నాడు.

7 వికెట్ల తేడాతో హైపీరియన్ జట్టు విజయం

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ తిరుచానూరు జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. శశాంక్ శ్రీనివాస్ 45 బంతుల్లో 7 సిక్సర్లు, 7 ఫోర్లతో 93 పరుగులు చేశాడు. అనంతరం 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైపీరియన్ జట్టు 38 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడగా పృథ్వీరాజ్ 45 బంతుల్లో 89 పరుగులు, హర్‌ష్రా 29 బంతుల్లో 53 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. 89 పరుగులు చేసిన పృథ్వీరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మెడిగో డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, రంజీ ప్లేయర్ ఎలైజర్, కోచ్ అనిత అందజేశారు.

నమాజు ఘటనలో మరో వ్యక్తి కేసు

తిరుమల: తిరుమలలో నమాజు సంఘటనకు సంబంధించి మరో వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తిరుమలలోని కల్యాణవేదికలో ఓ ముస్లిం నమాజు చేసిన సంఘటనలో ఇప్పటికే అతనిపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో వ్యక్తిపై కూడా సోమవారం కేసు నమోదైంది. ఇప్పటికే ముస్లిం వ్యక్తి నమాజు చేసేలా కొందరు వ్యక్తులు ప్రోత్సహించినట్లు టీటీడీ ఈఓ జే శ్యామలరావు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. మరో వ్యక్తిపై కేసును నమోదైంది. అయితే అతని గురించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

స్విమ్స్ సెక్యూరిటీలపై క్రమశిక్షణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆదేశించారు. స్విమ్స్‌లో సెక్యూరిటీ వ్యవహార శైలిపై 'ఈఓ ఎవడ్రా.. ఇది మా సామ్రాజ్యం' శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, జనరల్ మేనేజర్ రవీంద్ర, సెక్యూరిటీ ఆఫీసర్ ప్రకాష్, శానిటరీ సూపర్‌వైజర్ కాంతారావుతో డాక్టర్ రామ్ సమావేశంలో సెక్యూరిటీ సిబ్బంది వ్యవహార శైలిపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత బుధవారం రోగి సహాయకులతో గొడవకు దిగిన సెక్యూరిటీని వారం రోజులపాటు విధుల నుంచి తొలగిస్తూ చర్యలు తీసుకున్నారు. మరోసారి అదే వ్యక్తిపై ఫిర్యాదులు వస్తే పూర్తిగా విధుల నుంచి తొలగించాలని తీర్మానించారు. రోగులు వారి సహాయకుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది వ్యవహార శైలిపై శిక్షణ ఇవ్వాలని సంబంధిత సెక్యూరిటీ ఆఫీసర్‌కు సూచించారు. సెక్యూరిటీ సిబ్బంది ఇకపై దౌర్జన్యం చేసినా.. దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వస్తే మాత్రం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిని విధులు నుంచి పూర్తిగా తొలగిస్తామని డాక్టర్ రామ్ హెచ్చరించారు. రోగి సహాయకులకు టాయిలెట్లు అందుబాటులో లేకుండా తాళం వేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. టాయిలెట్లను వెంటనే అందుబాటులోకి తేవాలని శానిటరీ సూపర్‌వైజర్ కాంతారావును ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ మాట్లాడుతూ సెక్యూరిటీ వల్ల ఏదైనా ఇబ్బందులు వస్తే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

విలువలు పాటించాలి



నూతన చైర్మన్‌ను అభినందిస్తున్న ఏబీఆర్ఎస్ఎమ్ అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి, సభ్యులు

తిరుపతి తుడా: వైద్యరంగంలో నైతిక విలువలు పాటించాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ నూతన చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు అభిప్రాయపడ్డారు. సోమవారం తిరుపతిలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, సభ్యులు రమేష్, డాక్టర్ ఎం పద్మావతి నూతన చైర్మన్‌ను కలసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వైద్యరంగం ఎంతో పవిత్రమైనదని, కొత్తగా వృత్తిలోకి ప్రవేశించే డాక్టర్లు నైతిక విలువలు, మానవీయ దృక్పథం, దయ, పరస్పర గౌరవం మొదలైన విషయాలపై అవగాహన కల్పించిన తరువాత మాత్రమే వారికి రిజిస్ట్రేషన్ ఇస్తామని తెలియజేశారు.

శిల్పారామం అభివృద్ధికి కృషి



అభివృద్ధిపై సూచనలు చేస్తున్న రాష్ట్ర చైర్మన్ మంజుల రెడ్డి

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామాన్ని రాష్ట్ర శిల్పారామం చైర్‌పర్సన్ మంజుల రెడ్డి సోమవారం సందర్శించారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, గ్రామీణ మ్యూజియం, బోటింగ్, పచ్చదనం తదితరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిల్పారామం అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. సందర్శకుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆకర్షణీయమైన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రాఫ్ట్ ప్రోత్సాహక చర్యల ద్వారా శిల్పారామాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చాలని ఏఓ సుధాకర్‌కు సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలకు సన్మానం



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సన్మానిస్తున్న నరసింహయాదవ్

తిరుపతి అర్బన్: నగరంలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సమీపంలోని 2.49 ఎకరాల్లో 70 సెంట్లు మినహా మిగిలిన స్థలంలో ఇంటి నిర్మాణాలు చేసుకున్న వారికి 22ఏ నుంచి మినహాయింపు ఇచ్చారు. దీంతో కలెక్టరేట్‌లో సోమవారం యాదవ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌ను దుశ్శాలువాలుతో సత్కరించారు. చింతా భరణి యాదవ్, మహేష్, హేమంత్‌యాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ మండల కమిటీ నియామకం

తిరుపతి రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి రూరల్ మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మండల పార్టీ అధ్యక్షుడు	:	కొత్తపాటి మునీశ్వర రెడ్డి,
ఉపాధ్యక్షులు	:	కె.నరేష్‌రెడ్డి, వి.అశోక్‌కుమార్‌రెడ్డి
ప్రధాన కార్యదర్శులు	:	ఎం.హరికృష్ణారెడ్డి, పి.మోహనాచారి, వి.గోపాల్ రెడ్డి, వి.లక్ష్మయ్య
సెక్రటరీలు	:	బిరుదాల గోపాల్‌రెడ్డి, పండిటి గోపి, ఉదయ్‌కుమార్, పి.మునేంద్ర, ఎం.శివప్రసాద్, ఎ.గోవర్ధన్‌రెడ్డి, ఎన్.లోకేశ్వర్ రెడ్డి

అనుబంధ విభాగాల అధ్యక్షులు..

వైఎస్సార్‌సీపీ మండల యూత్ వింగ్	:	జంపాల సాయిరాయల్,
మహిళా విభాగం	:	కె.నాగభూషణమ్మ,
రైతు విభాగం	:	కె.గిరిధర్‌రెడ్డి,
బీసీ సెల్	:	జోగి మోహన్ కుమార్
ఎస్సీ సెల్	:	ఎం.మహేంద్ర
ఎస్టీ సెల్	:	ఆర్.సిద్ధయ్య
మైనార్టీ సెల్	:	షేక్ కరీముల్లా
క్రిస్టియన్ మైనార్టీ సెల్	:	ఎన్.జయకర్
విద్యార్థి విభాగం	:	జి.రఫీ
పంచాయతీ రాజ్ వింగ్	:	ఎన్.ధనమునిరెడ్డి
ఆర్‌టిఐ వింగ్	:	ఎ.శివ
వలంటీర్ వింగ్	:	ఎ.సురేంద్రరెడ్డి
వాణిజ్య విభాగం	:	ఎస్.మస్తాన్
వైఎస్సార్‌టీయూసీ	:	బి.బుజ్జిబాబు
అంగన్‌వాడీ వింగ్	:	కె.లక్ష్మీ
సాంస్కృతిక విభాగం	:	ఎం.ఈశ్వరయ్య,
సోషల్ మీడియా వింగ్	:	సి.చరణ్‌తేజ
మేధావుల విభాగం	:	కె.కృష్ణమూర్తి రెడ్డి
ప్రచార విభాగం	:	బొందు భాస్కర్ రెడ్డి
ఐటీ విభాగం	:	కె.మహేష్‌రెడ్డి
బూత్ కమిటీల విభాగం	:	చంద్రశేఖర్‌రెడ్డి

ఆర్టీసీ ఆస్పత్రి పరిశీలన

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. సోమవారం ఆయన అలిపిరి వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్టీసీ అస్పత్రిని పరిశీలించారు. జిల్లాలో 4700 మంది ఆర్టీసీ ఉద్యోగులతో పాటు 957 మంది ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఈ అస్పత్రి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి, డీపీటీఓ వెంకట్రావ్, అలిపిరి డీఎం హరిబాబు ఉన్నారు.

టీబీ విభాగం వైద్యులకు టీకా



టీకా వేయించుకుంటున్న డాక్టర్ హరికృష్ణ

తిరుపతి తుడా: టీబీ విభాగంలో రోగులకు సేవలందించే వైద్యులు క్షయ వ్యాధి బారిన పడకుండా టీకా వేసే కార్యక్రమానికి సోమవారం రుయా ఆస్పత్రిలో శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మొదటి టీకాను అసిస్టెంట్ ఆర్ఎంఓ హరికృష్ణకు వేశారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి క్రైమ్: నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆటోనగర్‌లోని దుర్గా హోం స్టేలో వ్యభిచారం జరుగుతున్నట్లుగా సమాచారం రావడంతో దాడులు నిర్వహించగా విటుడు, ఇద్దరు మహిళలు ఉన్నారన్నారు. విచారణలో సతీష్ రెడ్డి, వెంకటేష్ వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు తేలిందన్నారు. వెంకటేష్ హోమ్ స్టేలో పనిచేస్తూ సతీష్ రెడ్డితో పరిచయం ఏర్పరచుకుని బయట నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి హోమ్‌స్టేలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.